# ముకుందంగారి మేలు

వేసవికాలం వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. ఆఫీసునుంచి వచ్చేటప్పటికి బనియనూ షర్టే గాకుండా కోటుకూడా తడిసిపోతోంది. ఏమి ఎండలు! ఏమి ఎండలు!!

ఇంటికొచ్చి స్నానం చేసి, గళ్ళలుంగీ బనియనూ వేసుకు కూచున్నాను. ఫ్లాస్కులో టీ గ్లాసులోకి పోస్తూ, నా వంక వురుముతూ చూసింది శాంతాదేవి. మొదట్లో నాకు ఆ చూపు అర్థం కాలేదు. తరవాతనూ తెలియలేదనుకోండి— మాటలలో విడమరిచి చెప్పేదాకా.

"తువ్వాలొక్కటే తక్కువయింది. తువ్వాలు మెడమీద వేసుకుంటే అచ్చు జట్కాబండి తోలేవాడిలా ఉంటారు," అంది శాంతాదేవి.

"జట్కాబండి తోలేవాడిని మాత్రం అంత చులకనగా చూడటం ఎందుకు? పూనాలో టాంగా తోలేవాళ్ళలో బ్రాహ్మలుకూడా వుండేవారు."

"చదువు మహా వెలగబెట్టారు గాని, లోపలికి వెళ్ళి షర్టు వేసుకురండి. సాయంత్రం వేళ కూడానా, ఎవరయినా వస్తే ఈ అవతారం చూసి జడుసుకుంటారు."

"అంత జడుసుకునేటట్టు వున్నానా?" అని నన్ను నేను చూసుకున్నాను; గుక్క తర్వాత గుక్క తేయాకు పానీయం పుచ్చుకుంటూ.

"వేసవికాలంలో కూడా టీ తాగమని ఎవరు చెప్పారు? నేను ఎంచక్కాగా మజ్జిగలో అయిస్ వేసుక తాగాను. మజ్జిగయితే చలవ చేస్తుంది-మీకు పనికిరావుగా అలాటివి. మీరంతా సూకరాల మనుషులు," అంటూ మాటలు సాగదీసింది. చక్కటి తెల్లచీరె కట్టుకుని వుంది శాంత. ఆమె జడలోని మల్లెలు మా మాటలు విని నవ్వుకుంటున్నాయి.

టీ తాగడం అయిపోయాక, లోపలిగదిలోకి వెళ్ళి, బట్ట వేసుకుని వచ్చి, కూచున్నాను.

"వేసవిలో పల్చటిలాల్చీ లయితే బావుంటాయి. ఈ పాప్లిన్ బట్టలు పనికిరావు-నిముషంలో చెమటపడతాయి," అని సొంత గోడు చెప్పుకున్నాను.

"పల్చటి గ్లాస్కో లాల్చీలు వేసుకోవాలని కాబోలు—ముద్దుగావుంది కదూ! అలాంటివి గాని కుట్టించుకు యింటికి పట్టుకొచ్చారా, మర్నాడు మీరు ఆఫీసుకి వెళ్ళగా చూసి, గిన్నెలవాడికి యివ్వడం తథ్యం. వెనక మా వూళ్ళో అలాంటివి ఎవరు వేసుకునేవారో తెలుసా?" అని దుయ్యబట్టుకుంది శాంతాదేవి.

ఎవరు వేసుకునేవారో, ఆమె చేత మళ్ళీ యింకోసారి చెప్పించబోతూండగా, వీధి తలుపు తట్టినట్టయింది.

శాంతాదేవి సోఫాలోనుంచి లేచేటప్పటికి మల్లెల పరిమళంతో బాటు చందన అత్తరువు వాసనకూడా సన్నగా వచ్చింది. అత్తరువు రాసుకున్నావా?-అన్నట్టుగా నేనామె

వంక చూశాను. మీ కింతవరకూ తెలియనే లేదా?—
అన్నట్టుగా నా చూపుకి జవాబుగా చూసింది.

రండి—రండి అంటూ ఆహ్వానించాము వొచ్చిన పెద్ద మనిషిని. చాలా రోజు లయింది ముకుందంగారు మా యింటికివచ్చి. ఈమధ్య ఆయనకి కాంపులమీద కాంపులు తగులుతున్నాయట.

"మీ ఆవిడా, పిల్లలూ కులాసాగా వున్నారా ? సుమతి ఈ వేసంగులలో ఏదో ఎక్స్‌కర్షన్‌కి వెళ్తానంది-వెళ్ళిందా?" అని యోగక్షేమాలు వాకబుచేసింది శాంతాదేవి.

ముకుందంగారు కుర్చీలో చతికిలబడి, సిగరెట్ కేసు బయటికి తీసి, లైటర్‌కోసం జేబులన్నీ వెతికి, అగ్గిపెట్టె యిప్పించమ డంటున్నట్టుగా శ్రీమతి వంకచూసి, నాకో సిగరెట్ ఆఫర్ చేశారు. ఇలాటి వాటిలో నేను ధర్మరాజంతటి వాడిని. నాకు సిగరెట్టు అలవాటు లేకపోయినా, యితరులు యిస్తున్నప్పుడు వొద్దని అనను. నిక్షేపంగా పుచ్చుకు, అది కాస్తా వెలిగించి బూడిద చేస్తాను.

శాంతాదేవి అగ్గిపెట్టె యిచ్చిన తర్వాత ముకుందంగారు అన్నారు : 'ఏమి ఎండలు ! ఏమి ఎండలు !! ఎండలు మండిపోతున్నాయి. అసలు మన మద్రాసుకి పదినెలలు ఎండాకాలం, రెండునెలలు మరీ ఎండాకాలం. మా వాళ్ళందరూ చక్కగా అమలాపురం పెళ్ళికి వెళ్ళారు. మా ఆవిడ పినతల్లికూతురు పెళ్ళి. పదహారురోజుల పండగా అదీ జరి

పించి, దారిలో వున్న బంధుమిత్రులని చూసుకు, మే నెలా ఖరుకో, జూన్ మొదటి వారంలోనో వేంచేస్తారు.''

''అవును—సుమతికి సెలవులు కూడానా యిప్పుడు? సంవత్సరానికోసారి అయినా నెలా రెండునెలల పాటు పుట్టింట్లో గడపకపోతే బావుండదు,'' అంది శాంతాదేవి. స్త్రీలలో కాన్ని మేమిద్దరమూ ఆడిపోసుకుంటున్నట్టు.

తెలుగు సినిమాలూ, మద్యనిషేధం, రానున్న విశాలాంధ్ర, హైడ్రోజన్ బాంబు, వట్టివేళ్ళ తడికెలు మొదలైన విషయాలు మాట్లాడిన తర్వాత. 'మీరు ఆరు బయట పడుకుంటారా, యింట్లో పడుకుంటారా?' అని అడిగారు ముకుందంగారు.

తలవంచుకు, చాకుతో బంగాళాదుంపలు కోస్తున్న శాంతాదేవి, చటుక్కున తలఎత్తి అంది: 'ఆరుబయట పడుకోడంకూడానా—ఆయనకి నక్షత్రాలు చూస్తే భయమేస్తుంది—నిద్దర పట్టదట ఆకాశంవంక చూస్తూ పడుకుంటే. అందుకని నడివేసంగిలో కూడా ఫానేసుకు గదిలో మగ్గవలసిందే!'

''ఎంతయినా ఫానుగాలి అంత మంచిది కాదు. ఆరుబయట పడుకుంటే తగిలే గాలే వేరు. ఇది మీకు తెలియనిదేమీ కాదూ?'' అంటూ ముకుందంగారు, మాకొక కొత్తసమస్య తెచ్చిపెట్టారు.

నిజం చెప్పొద్దూ—నాకు ఆ నక్షత్రాలూ, ఆ ఆకాశం చూస్తూవుంటే ఏవో వెర్రి వెర్రి ఆలోచనలు, వచ్చి కంటి మీదికి వచ్చిన నిద్దర కాస్తా తుర్రుమంటుంది. హాయిగా నిద్రపోవడం కూడా ఒకవిద్యే అనాలి. అలాంటి విద్యలో గాని ఎవరయినా పరీక్ష జరపదలుచుకుంటే, శాంతాదేవికి మంచిమార్కులు రావడం ఖాయం.

పెళ్ళాంబిడ్డలూ వూళ్ళో లేరుగనక ముకుందంగారు ఆ పూటకి మా యింట్లోనే భోంచేసారు—శాంతాదేవి బలవంతం చేసినమీదట. భోజనాలై, తమలపాకులు వేసుకుంటున్నప్పుడు. మళ్ళీ మొదలెట్టారు ఆరుబయట పడుకోడం గురించి. 'శుభ్రంగా రెండు మడత మంచాలు కొనండి. మడత మంచం నాలుగయిదు రూపాయిలకంటె ఎక్కువ ఉండదు. ఎట్నే, ఫానుగాలి ఎందుకు పనికొస్తుందండీ దక్షిణాన్నుంచి వచ్చే గాలిముందు ?'

* * * *

ముకుందంగారు నాచేత నాలుగు సిగరెట్లు కాలిపించి వెళ్ళిపోయారు. ఆయన గుమ్మం దాటారో లేదో శాంతాదేవి అంది : 'నేను చెబితే విన్నారూ—ఫానుగాలి వొంటికి మంచిది కాదని. ఇన్ని ఖర్చుల్లో అదొక ఖర్చు—రేపు రెండు మడత మంచాలు కొని తీసుకురండి. హాయిగా ఆరు బయటని వేసుకు పడుకుందాం.'

కాదని అనేందుకు అవకాశం వుంటేనా? అదీగాక, కాదని ఎలా అనగలను?

మర్నాడు ముకుందంగారిని ఫోనులో అడిగాను: మడత మంచాలు ఎక్కడ దొరుకుతాయో చెప్పమని. 'ఎందుకండి అంతశ్రమ! మీరూ మీ ఆవిడా సాయింత్రంపూట చైనా బజారువైపుగా షికారువెళ్ళండి. కావలసినన్ని మడతమంచాలు కనిపిస్తాయి,' అన్నారు ఆయన ఫోనులో.

"మీవాళ్ళు వూళ్ళో లేరుగనక బుధవారంనాడు రండి-ఏదయినా పిక్చర్‌కి వెళదాం" అన్నాను.

"చూదాం లెండి." అన్నా రాయన.

చైనాబజార్ వైపుగా షికారుకెళ్తే మడతమంచాలు కనిపిస్తాయని ముకుందంగారన్నారని శాంతాదేవికి చెప్పాను. పెద్దమనిషి చెప్పాడుగదా అని ఆ సాయింత్రము చైనా బజార్ వైపు షికారు వెళ్ళాం. కళ్ళు పొడుచుకున్నా, మడత మంచాలు కనిపించలేదంటే నమ్మండి. మంచాలకి బదులు రెండు డజనుల పిన్నులూ, ఒక నెప్తలీన్ బాల్స్ పాకెట్టూ, కుంపటి వెలిగించుకునేది ఒకటీ, రెడ్ అండ్ బ్లూ పెన్సిల్ ఒకటీ కొనుక్కువచ్చాం. మడతమంచాలు ఎక్కడ దొరుకుతాయని, ధైర్యంచేసి ఒక ఆసామీని అడిగాం. రతన్ బజారువైపు వుంటాయనీ, ఈపాటికి కొట్లు కట్టేస్తారు గనక మర్నాడు ప్రయత్నించడం మంచిదనీ చెప్పాడు.

ఆ తర్వాత మూడురోజులపాటు నాపని యేమిటంటే మడతమంచాల వేట. ఒకసారో రెండుసారులో శాంతాదేవి వచ్చిందిగాని, కార్యభారం నామీద వొదిలేసింది. మడత మంచాల చరిత్రఅంతా తెలుసుకున్నానంటే అతిశయోక్తి కాదు. ఒక కొట్లో ఆరుకాళ్ళ మడతమంచం చూపించాడు.

నాకు నాలుగు కాళ్ళది చాలు—అన్నాను.

ఆరుకాళ్ళది యింకాగట్టిగా ఉంటుంది, మధ్యని గొయ్యి పడదు— అన్నాడు షాపతను.

గొయ్యిపడితే పూడ్చుకుంటాంకాని నాలుగు కాళ్ళదే కావాలి—అన్నాను.

లేవు—అన్నాడు.

చిన్నచిన్న షాపుల్లోకంటే పెద్దషాపుల్లో అయితే, ధర ఎక్కువయినప్పటికీ సరుకు నాణ్యంగా ఉంటుందని స్పెన్సర్స్‌కి వెళ్ళి మడతమంచాలు అడిగాను. శ్రేష్టమైన కాంపకాట్స్ నలభై ఏభై ఖరీదు చేసేవి—చూపించారు. శాంతాదేవిగారి బడ్జెట్ రెండు మంచాలకి కలిపి ఇరవై అయిదురూపాయిలు, ఇరవై అయిదులో రాకపోతేనో?—అన్నాను. ఎందుకు రావు, వస్తాయి!—అంది.

స్పెన్సర్స్‌లోనూ, రెన్ బెనెట్‌లోనూ, కర్జెన్‌లోనూ మన బడ్జెట్‌కి లోబడి పర్చేజెస్ చెయ్యలేకుని నిర్ధారణ అయినమీదట మవుంట్‌రోడ్డులోని మిగతా ఫర్నిచర్ కంపెనీలు చూడటం మొదలెట్టాను. మడతమంచాలెందుకు,

పెద్దమంచాలు తీసుకోమని—ఒకాయన అన్నాడు. కాంప్ కాట్ నే మడతమంచం అంటారని-మరొకతను వ్యాఖ్యానం చెప్పాడు. మడతమంచాలు మన్నవ్—పట్టెమంచాలు చేయించియివ్వనా ?—అని యింకొకతను అడిగాడు.

ముకుందంగారిని మళ్ళీ సంప్రదించడం మంచిదేమో ననిపించింది కాని యింతచక్కని చదువుకు మద్రాస్ మహా నగరంలో మడతమంచం బేరమాడలేకపోవడం సిగ్గేసింది. ఆయనని అడిగితే చెబుతారు కాని అడగ బుద్ధవలేదు.

ఒక కప్పు వేడికాఫీ తాగినమీదట నా మట్టుకు నాకే ఒక ఆలోచన తట్టింది. పాత ఫర్నిచర్ అమ్మే షాపులలో దొరుకుతాయేమో మడతమంచాలు ? అదీగాక, యింకా రతన్‌బజారు చూడాల్సివుంది. అక్కడ కూడా ఫర్నీచర్ షాపులు వున్నాయిగా !

"ఏమయితేనేం, ఆ సాయంత్రంలోపున రెండు ఛేప్పైన మంచాలు ఖరీదు చేశాను—అంటే కొన్నానన్నమాట.

మంచాలు తోపుడు బండిలో వస్తున్నాయి—నేను ముందుగానే వచ్చి శుభవార్త శాంతాదేవి చెవిని వేశాను.

"అయితే ఈ పూట మనం ఆరుబయట పక్కలు వేసుకో వచ్చుగా !" అంది శాంతాదేవి,—యిన్నాళ్ళబట్టీ ఏదో బరువు మోస్తున్నట్టూ, ఈ క్షణాన ఆ బరువు దించినట్టూ.

"ఇవ్వాళ ఎలా కుదురుతుంది ! కాన్వాస్ గుడ్డ కుట్టించాలిగా !" అన్నాను.

"అదేమిటి ?-గుడ్డలేని మంచాలు కొన్నారన్న మాట."

"కాదులే—చాలా చవకగా దొరికాయి. ఒకటో రకమైన రంగూన్ 'టీక్' మంచాలు."

"మీకది రంగూన్ 'టీక్' అని ఎలా తెలుసు?"

"కొట్టువాడు చెప్పాడుగా!"

"ఇంతలో మంచాలు, అందుకు కావలసిన యివపకడ్డీలూ వచ్చాయి. బండివాడికి కూలీయిచ్చేసి పంపినపూడట, "ఒక మంచం పొట్టి, ఒక మంచం పొడుపూగా ఉన్నాయేమిటి?" అంది శాంత.

"పొట్టి మంచం ఆడవాళ్ళకి, పొడుగుమంచం మొగ వాళ్ళకి."

"ఈ సంగతికూడా కొట్టువాడే చెప్పాడా?"

"ఆ...లేదు."

"మడతమంచం గుడ్డకూడా ఆ చేతితోటే కొని తీసుకు రాలేకపోయారా?"

"ఈపూట తీసుకొచ్చినా కుట్టించడం పడదు. అందుకని తీసుకురాలేదు," అని సవినయంగా చెప్పుకున్నాను.

ఎందువల్లనో శాంతాదేవి మొహం విప్పారలేదు. మడత మంచాలు చూసి సంతోషిస్తుందనుకున్నాను. నేను బాగా బేరంచేసి, చవకలో పట్టుకొచ్చానని అభినందిస్తుందను కున్నాను కాని అలాటిదేమీ లేకుండా, 'టీ చల్లారి పోతోంది—పుచ్చుకోండి' అంది—డ్రయ్‌గా.

మర్నాడు మడతమంచం క్లాత్ పట్టుకొచ్చాను. వస్తూ వస్తూ కాంప్ కాట్లు కుట్టేవాణ్ణి యింటికి రమ్మన్నాను. మంచం ఒక్కంటికి మూడున్నర రూపాయిలతో మొదలెట్టి, రూపాయి, రూపాయికి వొప్పుకున్నాడు. చర్మం వేసి భేషుగ్గా కుడతానన్నాడు. కర్ర విరగవచ్చుగాని తను వేసిన కుట్టు మాత్రం తెగదన్నాడు.

సాయంత్రం నేను ఆఫీసునుంచి యింటికి వచ్చేవేళకి రెండు మంచాలకి గుడ్డలు తయారుగా వున్నాయి. ఎటొచ్చీ, యినపకడ్డీలలోనుంచి దూర్చి, మంచాలకి వెయ్యడమే తరువాయి. గుడ్డలు కుట్టినవాణ్ణే అవి తొడగమని, నేను స్నానానికి వెళ్లాను.

రెండు మంచాలకి కలిపి నాలుగు యినపకడ్డీలు వున్నాయి. అందులో మూడు ఒక సైజువి, మరొకటి ఒక్కటీ ఒక సైజుది. ఒక మంచానికి యిటు అయిదూ, అటు అయిదూ చొప్పున రింగులు వున్నాయి. మరొకదానికి నాలేసి చొప్పునే వున్నాయి. మొత్తం పద్ధెనిమిది రింగులలోనూ మూడు రింగులు మిస్సింగ్. పనివాడు హాతలా కుతలం అవుతున్నాడుగాని యినపకడ్డీలు రింగుల్లోనుంచి వెళ్ళడం లేదు.

ఆ రోజున దేవుడిలా వచ్చారు ముకుందం గారు. ఆ రోజు బుధవారం అన్న సంగతే మర్చిపోయాం నేనూ శాంతానూ.

ఆయనని చిరునవ్వుతో పలకరిస్తూ "చూశారా—మీ ఫ్రెండుచేసిన ఘనకార్యం!" అంది శాంత.

నేనేం చేశాను చెప్పండి? మూడురోజులు బజారంతా తిరిగి చవకగా మంచాలు కొన్నాను. మంచాలకి గుడ్డ కొన్నాను. కుట్టేవాణ్ణి కుదిర్చి, కుట్టించాను. ఆ గుడ్డ సరిగ్గా పట్టకపోవడం నా తప్పా?

"ఎవరి తప్పూ కాదు. ఈ పూట సినీమాకి పోదాం—పదండి. సీట్లు రిజర్వ్ చేయించాను కూడాను. టేకుమాత్రం మంచి టేకు. రేపు మా కార్పెంటర్ని పంపుతాను. అతనంతా సరిచేసి యిస్తాడు. ఈ కుర్రాయికి కూలి యిచ్చేసి పంపి, తొందరగా తెమలండి," అని చకచకా తేల్చేశారు ముకుందంగారు.

మర్నాడు ఆయనకి తెలిసిన పనివాడు వచ్చాడు. మడత మంచాలు ఒకదారిలోకి తీసుకువచ్చాడు. ఒకటి కుంటిని అయినప్పటికీ రెండోది బాగానే వుంది. రెండూ కుంటివి నయితే బావుండేది, అంటుంది శాంతాదేవి. ఏమయినా, చల్లటివేళ చెప్పుకోవాలి ముకుందంగారిని!